క్లుప్తంగా

పబ్లిక్ టాయిలెట్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న వివేక్

సాక్షి ఎఫెక్ట్..

మందమర్రిరూరల్: ఏళ్లుగా స్థానిక మార్కెట్ బస్టాండ్ ఏరియాలో పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ఈ నెల 10న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'పబ్లిక్ పరేషాన్' అనే కథనానికి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి స్పందించారు. మందమర్రి మార్కెట్ బస్టాండ్ ప్రాంగణంలో ఆదివారం రూ.18లక్షలతో నిర్మించే పబ్లిక్ టాయిలెట్‌కు శంకుస్థాపన చేశారు. ఎట్టకేలకు పబ్లిక్ టాయిలెట్‌కు శంకుస్థాపన చేయడంతో పట్టణ ప్రజలు 'సాక్షి' దినపత్రికకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మార్కెట్ వర్తక వ్యాపార కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

నేడు మండల సమావేశం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల ప్రజాపరిషత్ ప్రత్యేక సర్వసభ్య సమావేశం 22వ తేదీ సోమవారం ఉదయం 11గంటలకు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌హై ఆదివారం ఒక ప్రకటనలో తెలిపా రు. బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు(బీపీడీపీ) 2024–25, సబ్‌కీ యోజన–సబ్‌కీ వికాస్(ఎస్‌వైఎస్‌వీ) ప్రణాళిక తయారీ కోసం మండల పరిషత్ ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. సమావేశానికి గౌరవ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలని కోరారు.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం



నియామక పత్రాలు అందిస్తున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: జిల్లాలోని పలు మండలాలకు బీజేపీ మండల అధ్యక్షులను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆదివారం నియమించారు. నస్పూర్ మండలాధ్యక్షుడిగా సత్రం రమేశ్, హాజీపూర్ అధ్యక్షుడిగా గడ్డం స్వామిరెడ్డి, చెన్నూర్ పట్టణ అధ్యక్షుడిగా కొరకొప్పుల వంశీ, చెన్నూర్‌రూరల్ అధ్యక్షుడిగా మెర్ల శంకర్, జైపూర్ మండలాధ్యక్షుడిగా దుర్గ ప్రసాద్, భీమారం మండలాధ్యక్షుడిగా నర్రా గౌతంరెడ్డి, మందమర్రి పట్టణ అధ్యక్షుడిగా మర్త కుమార్, మందమర్రి రూరల్ అధ్యక్షుడిగా సుంకరి రాజేందర్, క్యాతనపల్లి మున్సిపల్ అధ్యక్షుడిగా వేముల అశోక్, తాండూర్ అధ్యక్షుడిగా రమగొని మహీధర గౌడ్, బెల్లంపల్లి రూరల్ అధ్యక్షుడిగా బుడిమే విజయ్‌లను నియమిస్తూ, ఆదివారం నియామక ఉత్తర్వులను అందించారు.

ఆదివాసీలకు అందని సంక్షేమ ఫలాలు



మాట్లాడుతున్న సంఘం నాయకులు

చెన్నూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ ఫలాలు మైదాన ప్రాంత ఆదివాసీలకు అందడం లేదని ఆదివాసీ సంఘం నాయకులు జేక శేఖర్ అన్నారు. స్థానిక ఎస్టీ తాత్కాలిక సంఘ భవనం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉట్నూర్ ఐటీడీఏ నుంచి గతంలో ఐఏవై ఇళ్లు, బోరు బావుల నిర్మాణం, ఎండ్ల బండ్ల కొనుగోళ్ల కోసం రుణాలు అందజేసినట్లు తెలిపారు. గత ఐదేళ్లుగా ఎలాంటి రుణాలు, ఇళ్లు మంజూరు చేయడం లేదన్నారు. అటవీ సంపదపై జీవనం సాగిస్తున్న ఆదివాసీలకు ఉపాధి లేక దుర్భర జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో మినీ ఐటీడీఏను ఏర్పాటు చేసి, మైదాన ప్రాంత ఆదివాసీలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కలెక్టర్ కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం నాయకులు చెడెంకి మాంతయ్య, పెద్దల వెంకటేశం, ఆలం బాపు, బిస్కుల లక్ష్మణ్ పాల్గొన్నారు.



లోతొర్రేకు వెళ్లే దారి

సమస్యల్లో గూడేలు..!

- నేటికీ రోడ్డు, నీటి సౌకర్యం కరువు
- ప్రభుత్వాలు మారుతున్నా, మారని గిరిజనుల తలరాతలు

స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా నేటికీ కొన్ని గిరిజన గూడేలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. నీటి సౌకర్యం లేక, గ్రామాలకు వెళ్లడానికి దారి లేక నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా, గిరిజనుల తలరాతలు మారడం లేదు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనైనా తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశతో గిరిజనులు ఎదురుచూస్తున్నారు.
– జన్నారం



అలీనగర్‌లో చేతి పంపు నుంచి నీరు తెచ్చుకుంటున్న గిరిజన యువకుడు

దారిలేని గూడేలు ఎన్నో..

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుని రాష్ట్రం అభివృద్ధి జరుగుతున్న తరుణంలో ఆదివాసీ గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలోని జన్నారం, దండేపల్లి, కాసిపేట, నెన్నెల మండలాల్లోని గిరిజన, ఆదివాసీ గూడేలు నేటికీ రహదారికి నోచుకోలేదు.

- జన్నారం మండలంలోని లోతొర్రే గ్రామ పంచాయతీగా మారినా, నేటికీ రహదారి లేక ఇబ్బంది పడుతున్నారు. వర్షకాలంలో వాగు ఉప్పొంగితే రాకపోకలు నిలిచిపోయి అనేక ఇబ్బందుల పాలవుతున్నారు. కొత్తపేట గ్రామ పంచాయతీ రాయికుంట గూడేనికి దారి కష్టాలు తప్పడం లేదు. వారు కొత్తపేట, కొలంగూడ మీదుగా చెరువు కట్ట దాటి చేల నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారు. మల్యాల, దొంగపల్లి, అలీనగర్ గ్రామాలకు రోడ్డు సౌకర్యం, నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడక తప్పడం లేదు.
- దండేపల్లి మండలంలోని ఊట్ల గిరిజన గ్రామం మండల కేంద్రం నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆ గ్రామానికి వెళ్లేందుకు బీటీ రోడ్డు మంజూరైనా, అటవీ అనుమతులు లభించని కారణంగా కొంతవరకు బీటీ రోడ్డు వేసి, మిగితా గ్రామం వరకు మెటల్ రోడ్డు వేశారు. మెటల్ రోడ్డు ప్రస్తుతం కంకర తేలి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా, ఫలితం లేదని గిరిజనులు వాపోతున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా కావడం లేదని గిరిజనులు వాపోయారు.
- నెన్నెల మండలంలోని పాటి, బోగంపల్లి, దర్మరెడ్డిపేట, కోనంపేట గిరిజన గూడేలున్నాయి. బోగంపల్లికి, కోనంపేట గూడేలకు దారి కరువైంది. మిగితా గ్రామాల్లో నీరు, రోడ్డు సమస్యలున్నట్లు తెలిపారు.
- కాసిపేట మండలంలో 15వరకు గిరిజన గూడేలున్నాయి. కొన్ని గూడేల్లో నీటి సమస్య, మరికొన్ని గూడేలకి దారి సమస్య ఉందని పేర్కొంటున్నారు. కొత్త కురెగడ్ గిరిజన గ్రామానికి దారి లేక తిప్పలవుతుందని గూడెం వాసులు పేర్కొంటున్నారు.

రోడ్డు వేయాలి



ఏళ్లుగా మా గూడేనికి పోవడానికి రోడ్డు లేదు. ఉన్న రోడ్డు కంకర తేలింది. ఈ రోడ్డుపై రాకపోకలు ఇబ్బందిగా ఉన్నాయి. ఓట్లప్పుడు వచ్చినప్పుడు రోడ్డు వేస్తామని, ఇప్పుడు మరిచిపోతుండ్రు. మా బాధలు తెలుసుకుని డాంబర్ రోడ్డు వేయాలి. – మోతే రజిత, ఊట్ల

నీటి సౌకర్యం లేదు



20ఏళ్లుగా మా గూడెంలో నివసిస్తున్నాం. ఇప్పటికీ మా ఊరికి రోడ్డులేదు. మంచినీటి సౌకర్యం లేదు. బోరింగ్ నీళ్లే వాడుకుంటున్నాం. పత్తి చేల నుంచి నడుచుకుంటూ పోవాల్సి వస్తుంది. రాత్రి పూట ఇబ్బంది అవుతంది. మా ఊరికి రోడ్డు సౌకర్యం కల్పించాలి. – సొంగు, రాయికుంట

వంతెన నిర్మించాలి



కవ్వాల్ నుంచి సోనాపూర్ తాండా మీదుగా లోతొర్రెకు వెళ్లాల్సి ఉంది. వాగు ఉండటం వల్ల రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. అధికారులు స్పందించి రోడ్డు, వంతెన సౌకర్యం కల్పించాలి. – బహదూర్ షా, లోతొర్రే

ఆకట్టుకున్న 'గరికపాటి' ప్రవచనాలు



ప్రవచనాలు చెబుతున్న గరికపాటి నరసింహారావు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని హైలైఫ్ హోటల్లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అష్టోత్తర శత సుందరకాండ పారాయణ సహిత శ్రీ రుద్రా మహాయాగ మహోత్సవం ఆదివారంతో ముగిసింది. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, రాజకుమారి దంపతులు ఆదివారం యాగంలో పాల్గొని, ప్రత్యేక హోమ పూజలు చేశారు. ఆవోపా ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ డాక్టర్ బాచంపల్లి సంతోశ్ కుమార్ శాస్త్రి అధ్యక్షతన ఈ కార్యక్రమాలను నిర్వహిస్తుండగా, పట్టణంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలో పాల్గొన్నారు. సాయంత్రం గరికపాటి నరసింహారావుతో నిర్వహించిన విశేష ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలు సాహిత్య, ఆధ్యాత్మిక అంశాలపై భక్తులకు వివరిస్తూ, చలోక్తులు విసిరి, తన ప్రవచనాలను ఆద్యాంతం ఆకట్టుకునేలా వివరించారు.

'సమ్మయ్య మరణం తీరని లోటు'



మాట్లాడుతున్న ఖాసీం

శ్రీరాంపూర్: కళాకారుడు దప్పు సమ్మయ్య మరణం కళాకారులకు తీరని లోటని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసీం అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీసీసీకి చెందిన ప్రముఖ కళాకారుడు దప్పు సమ్మయ్య సంతాప సభ ఆదివారం నస్పూర్ కాలనీలోని సేవా భవన్ మైదానంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఖాసీం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో సమ్మయ్య తన డప్పుచప్పుళ్లు, పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రజలను చైతన్యం చేశారన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కలవేని శంకర్, కళాకారులు అంతడ్పుల నాగరాజు, రేగుంట చంద్రశేఖర్, తేలు విజయ, రాంనర్సయ్య, కౌన్సిలర్లు మేకల దాసు, వంగ తిరుపతి, నాయకులు జక్కుల రాజేశం, మంగ, తదితరులు పాల్గొన్నారు.

దుబ్బగూడెంలో సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న నెన్నెల పోలీసులు

నెన్నెల: మండలంలోని దుబ్బగూడంలో నెన్నెల పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా సైబర్ నేరాలపై ఆదివారం యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. చాలా మంది యువకులు ఆన్‌లైన్ మోసాలకు బలవుతున్నారని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ గ్రామాభివృద్ధికి పాటుపడాలని కోరారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదన్నారు. అపరిచితుల నుంచి వచ్చిన మెసేజ్‌లను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయొద్దన్నారు. కార్యక్రమంలో పోలీసులు సత్యం, అనంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఏడీఈ రాంచందర్

నెన్నెల: వినియోగదారులకు ఎలాంటి ఆటంకం లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందేలా చూడాలని బెల్లంపల్లి విద్యుత్ ఏడీఈ రాంచందర్ అన్నారు. నెన్నెల, ఆవుడం మెయిన్ విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మల కత్తిరింపు కార్యక్రమాన్ని ఆదివారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది విద్యుత్ వినియోగదారులకు, రైతులకు అందుబాటులో ఉంటూ 24గంటలు విద్యుత్ సరఫరా చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఈ చిన్న ప్రమాదం సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పెండింగ్ లేకుండా నెలనెలా వంద శాతం బిల్లులు వసూలు చేయాలని ఆదేశించారు. సబ్‌స్టేషన్‌లను నిరంతరం పర్యవేక్షించాలని విద్యుత్ ఏఈ మల్లయ్యకు సూచించారు. ఆయన వెంట లైన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, లైన్‌మెన్ లచ్చన్న, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా లెనిన్ వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు కామ్రెడ్ లెనిన్ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యమ చరిత్రను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్, నాయకులు బ్రహ్మానందం, తిరుపతి, శ్రీకాంత్, శ్రీనివాస్ చరణ్, ప్రభాకర్, ప్రకాశం పాల్గొన్నారు.

ఆలయాలు ముస్తాబు

మందమర్రిరూరల్: అయోధ్యలో నిర్మించిన రామ మందిర్‌లో సోమవారం బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కంచుకొని మందమర్రిలోని పలు ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆలయాలను సుందరంగా అలంకరించారు. మార్కెట్ ఏరియాలో రాముని జెండాలు ఇంటింటా ఎగురవేశారు. ప్రజలు ప్రత్యక్ష ప్రసారం వీక్షించేందుకు ప్రత్యేక డిజిటల్ స్క్రీన్‌లు ఏర్పాటు చేశామని, ప్రత్యేక పూజ, భజన కార్యక్రమాలతో పాటు కార్యక్రమం అనంతరం అన్న ప్రసాదాల పంపిణీ ఉంటుందని ఆలయాల నిర్వాహకులు తెలిపారు. పాలచెట్టు సమీపంలోని పంచముఖి హనుమాన్ టెంపుల్‌లో సీతారాముల కల్యాణంలో ఉదయం ఎనిమిది గంటలకు టెంపుల్ కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ అర్చకులు కృష్ణకాంతాచార్యులు తెలిపారు.



చెన్నూర్: పట్టణంలోని ఆలయాలను రంగురంగుల లైట్లు, పూల దండలతో అలంకరించారు. అయోధ్యలో సోమవారం బాల రాముని ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకొని స్థానిక అయ్యప్ప, జగన్నాథాలయాలను ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అలంకరించారు.

ప్రత్యేక ఓటరు నమోదు



అవగాహన కల్పిస్తున్న డీటీ ప్రసాద్

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ మండలంలో ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. బెజ్జాల, నర్సాపూర్ గ్రామపంచాతీల పరిధిలోని వాసాల మాడ, బీర్సాయి గూడ, గిరి జన గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. 18ఏళ్ల వయో పరిమితి నిండిన యువతీ యువకుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. తాండూర్ మండల డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తలమల, మన్నెగూడలో వసతులు కరువు..!



మన్నెగూడ ముఖచిత్రం



కంకర వేసి వదిలేసిన రోడ్డు

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధి తలమల, మన్నెగూడ గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. ప్రభుత్వం ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా, వారికి అందడం లేదు. మండలానికి 15కిలోమీటర్ల దూరం అటవీప్రాంతంలో బాహ్య ప్రపంచానికి దూరంగా తలమల, మన్నెగూడ రెండు గ్రామాలున్నాయి. సుమారు 50కుటుంబాల వరకు గ్రామాల్లో నివసిస్తుంటారు. గ్రామాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం కోసం అధికారులు తారు రోడ్డు వేయడానికి కంకర వేసి ఇప్పటి వరకు అలాగే వదిలేశారు. ఆ రోడ్డుపై నడవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలని కోరుతున్నారు. డ్రెయినేజీ సౌకర్యం లేక మురుగునీరు ఇష్టారాజ్యంగా పారుతోంది. చేతి పంపు ప్రదేశం చుట్టూ మురుగు నీరు చేరి దుర్వాసన వస్తోంది. విద్యుత్ సమస్య కూడా వేధిస్తోంది. ఆ రెండు గ్రామాలకూ అంబులెన్సు రావాలంటే ఇబ్బందిగా ఉంటోంది. తాగునీటి సమస్య ఉండడం మిషన్ భగీరథ నీరు సరిగా రాకపోవడంతో చేతి పంపులను ఆశ్రయిస్తున్నారు. రేషన్ దుకాణం గ్రామాల్లో లేకపోవడంతో రంగపేట గ్రామానికి సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరం కాలినడకన వచ్చి తీసుకెళ్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని తక్షణమే గ్రామానికి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

ఇబ్బంది అవుతోంది..

గ్రామంలో డ్రెయినేజీ సౌకర్యం లేదు. వర్షకాలంలో మురుగునీటితో చాలా ఇబ్బందవుతోంది. రోడ్డుపై కంకర పోసి వదిలేయడంతో నానా అవస్థలు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని సౌకర్యాలు కల్పించాలి. కరెంట్ సరిగా ఉండదు. మన్నెగూడలో ఇళ్లు సరిగా లేవు. పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. – జంగు, తలమల

త్వరలోనే పూర్తిచేస్తాం..

డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తారు. రోడ్డు నిర్మాణం పనులు కూడా త్వరలోనే పూర్తిచేస్తారు. గ్రామంలో ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తాం. – నాగేశ్వర్ రెడ్డి,ఎంపీడీవో, లక్సెట్టిపేట

మురుగు కాలువలు లేక ఇబ్బందులు



కాచన్‌పల్లిలో రోడ్డుపై నిలిచిన నీరు



సుబ్బరాంపల్లిలో బడి ఆవరణలో..

చెన్నూర్‌రూరల్: మండలంలోని కాచన్‌పల్లి, సుబ్బరాంపల్లి గ్రామాల్లో మురుగు కాలువలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాచన్‌పల్లిలో బోరుబావి నుంచి వచ్చే నీరంతా రోడ్డుపైనే చేరుతుంది. సుబ్బరాంపల్లిలో ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న చేతి పంపు సమీపంలో ఇంకుడు గుంత ఉన్నా, అందులో నీరు ఇంకకపోవడంతో ఆవరణంతా నీటిమయం అవుతోంది.దీంతో పాఠశాలలోకి వెళ్లేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని మురుగు నీరు రోడ్డుపై పారకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా స్థాపిత దేవత పూజ

- పాల్గొన్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు దంపతులు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కుటుంబసభ్యులు

మంచిర్యాలటౌన్: అయోధ్య రామ మందిర ప్రతిష్ఠా పురస్కృతి శ్రీ సుదర్శన నారసింహ సహిత విశ్వశాంతి శ్రీరామాయణ మహాయాగములో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో శాంతిపాఠం స్థాపిత దేవత పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, ఆయన సతీమణి డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, వారి కుమారుడు, కోడలు, మనవరాళ్లు పాల్గొని యాగం, పూజలను ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకాగా, విశేష రామాయణ శ్లోక సంపుటి హవనం, నిత్య పూర్ణహుతి కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం లలిత సహస్రనామ పారాయణం, దీపోత్సవం, సామూహిక భజన కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తిపారవశ్యంతో పులకించారు.

బీసీ జనగణన చేపట్టాలి



కట్టపోచమ్మ ఆలయం ఎదుట నినాదాలు చేస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

పాతమంచిర్యాల: కేంద్రం బీసీ జనగణన చేపట్టాలని బీసీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి, పాలకులకు బీసీ జనగణన చేపట్టేలా మంచి బుద్ధి ప్రసాదించాలని జిల్లా కేంద్రంలోని కట్టపోచమ్మ ఆలయంలో ఆదివారం పూజలు నిర్వహించారు. బీసీ కుల గణన చేపడతామని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ అగ్రవర్ణాల ఒత్తిడితో వెనక్కి తగ్గారన్నారు. బీసీల జనాభా లెక్క తేలితేనే రిజర్వేషన్ ఫలాలు సక్రమంగా అందుతాయన్నారు. బీసీలకు న్యాయం అందించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ మనోహర్, నాయకులు కనుకుట్ల మల్లయ్య, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, అఖిల గాండ్ల తేలికుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ధి చంద్రమౌళి, కురుమ సంఘం నాయకుడు సమ్ము రాజన్న పాల్గొన్నారు.